**AKSHARA TODAY**

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

4-8-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



**పోతంగల్‌లో ఘనంగా బోనాలు**



2



2

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**


## విద్యుత్ సమస్యల పరిష్కారానికి హైడ్రాలిక్ లిఫ్టర్ సేవలు ప్రారంభం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని విద్యుత్ అంతరాయాల పరిష్కారానికి హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనం సేవలు ప్రారంభించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు పవర్‌హౌస్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ ట్రాన్స్‌కో సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలను అందించాలనే లక్ష్యంతో టీజీఎన్‌పీడీసీఎల్, నిజామాబాద్ ఆపరేషన్ సర్కిల్ పరిధిలో టాటా యోధా 3.0 ఎంటీ హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనాన్ని సేవలోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు.

## సెల్ఫీల కోసం ప్రాణాలు తీసుకోవద్దు: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** సెల్ఫీలు, వీడియోల కోసం వాగులు, కల్వర్టులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రాణాలు తీసుకోవద్దని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం ఆయన పట్టణంలోని పెద్ద చెరువు, జీఆర్ కాలనీ బ్రిడ్జి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాలు, చెరువులు, రద్దీ కూడళ్ల వద్ద అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ ఫీల్డ్‌లోనే ఉండి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భారీవర్షాలు కొనసాగుతున్నందున ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా డయల్ 100ను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట డీఎస్పీ మధుసూధన్, టౌన్ సీఐ నరహరి, రూరల్ సీఐ శ్రీధర్, ఎస్ఐలు రంజిత్, చంద్రశేఖర్ గౌడ్ తదితరులున్నారు.

## వర్షాల నేపథ్యంలో పోలీసుల సేవలు అభినందనీయం: సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** వర్షాల నేపథ్యంలో పోలీసుల సేవలు అభినందనీయమని సీపీ సాయిచైతన్య అన్నారు. సీపీ కార్యాలయంలో ఆరో టౌన్ పోలీస్ సిబ్బందిని మంగళవారం సన్మానించారు. నగరంలోని ఆరో టౌన్ పరిధిలోని బోధన్ రోడ్‌లో అల్ రెహమాన్ హోటల్ నుండి నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వరకు వెళ్లే దారిలో భారీ వర్షం కారణంగా నీళ్లు నిలిచిపోయాయి. బోధన్ వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆరో టౌన్ ఎస్సై సందీప్ ఆదేశాల మేరకు ఏఎస్సై జక్రయ్య, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా హుటాహుటిన స్పందించారు. వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం నిండిపోయి రోడ్డుపై భారీ ఎత్తున నీళ్లు నిలిచిపోవడాన్ని గమనించిన పోలీసులు వెంటనే జేసీబీలు తెప్పించి చెత్తను తొలగింపజేశారు. పనులు పూర్తయ్యేవరకు అక్కడే ఉంచి పర్యవేక్షించారు. దీంతో వీరిద్దరిని సీపీ సాయిచైతన్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాశ్ యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆరో టౌన్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.



**గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వ వైద్య రంగం బాల్కొండ నియోజకవర్గంలో తీవ్ర అలసత్వానికి గురవుతోంది. నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల్లోనూ వైద్య సేవలు అరకొర వసతులతోనే సాగుతున్నాయి. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యారోగ్య అభివృద్ధి కోసం కొన్ని పనులు చేపట్టగా కొన్ని మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ భవన నిర్మాణాల పనులు ముందుకు సాగట్లేదు.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

# వైద్యారోగ్యానికి గ్రహణం..

■ ప్రతిపాదనలకే పరిమితమైన ఆస్పత్రి భవనాలు.. ■ బాల్కొండ నియోజకవర్గంలో నిర్లక్ష్యం ■ అవస్థలు పడుతున్న రోగులు



పనులు ప్రారంభించిన కొన్ని ఆసుపత్రి భవనాలను నిధుల కొరతతో సగంలోనే వదిలేశారు. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్నప్పటికీ, ఆగిపోయిన పనులను ముందుకు తీసుకెళ్లడంలో లేదా నూతన నిధులు కేటాయించడంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..?

గత ప్రభుత్వ హయాంలో భీమ్‌గల్ పట్టణంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణం అరకొర నిధులతో అసంపూర్తిగా మిగిలిపోయింది. బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేశారు. అలాగే భీమ్‌గల్ పీహెచ్‌సీని రాహత్ నగర్‌కు తరలించి నూతన భవనం నిర్మించడం, భీమ్‌గల్‌లో అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేయడం, మోర్తాడ్ మండలంలోని పాలెం లేదా తిమ్మాపూర్‌లో కొత్త పీహెచ్‌సీని మంజూరు చేయడం వంటి అంశాలు గతంలో పంపిన ప్రతిపాదనల దశ దాటలేదు. నాటి ప్రభుత్వం ఆరంభించిన ఈ పనులు, ప్రతిపాదనలు ఇప్పటికీ కదలిక లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా, బకాయి బిల్లులను విడుదల చేసి, ఆగిపోయిన పనులను వేగవంతం చేయడంలో తాత్సారం చేస్తోందనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

### కదలని దస్త్రాలు..

బాల్కొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరినా నూతన భవన నిర్మాణానికి ఇంకా మోక్షం లభించలేదు. అత్యవసర సమయాల్లో శవపరీక్షల కోసం బాల్కొండ, మోర్తాడ్ మండలాల్లో కొత్తగా పోస్టుమార్టం భవనాలు నిర్మించాలనే ఆవశ్యకతను పాలకులు విస్మరిస్తున్నారు. గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాలకు వెన్నుముక లాంటి 9 ఉపకేంద్రాల భవన నిర్మాణాలకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రాక నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రతిపాదించిన 18 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలకు నిధుల కేటాయింపు నిలిచిపోయింది.

### ఎనిమిది మండలాల్లోనూ అరకొర సేవలే..

నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలో ఉచిత వైద్యం తీవ్ర ప్రతిబంధకాలను ఎదుర్కొంటోంది. బాల్కొండ, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల్లో ప్రధాన ఆస్పత్రి భవనాలు అసంపూర్తిగా ఉండటం, పోస్టుమార్టం సౌకర్యం లేకపోవడం పెను సమస్యగా మారింది. కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణాలు నిధుల లేమితో సగంలోనే ఆగిపోగా, ఆయుష్మాన్ మందిరాల ఏర్పాటు ఊసే లేదు. ముప్కాల్, మెండోర మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత, రాత్రివేళల్లో వైద్యుల అందుబాటు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన ఏర్గట్ల మండలంలో ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం కూడా లేకపోవడం, పారామెడికల్ సిబ్బంది నియామకం జరగకపోవడం వైద్యారంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

### ప్రభుత్వం చొరవ చూపాలి


ప్రభుత్వం స్పందించి గ్రామీణులకు వైద్యం అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదనలకే పరిమితమైన భవనాలకు వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాటు, సగంలో నిలిచిపోయిన భీమ్‌గల్ 100 పడకల ఆస్పత్రి, హెల్త్ సబ్‌సెంటర్ల బకాయి నిధులను తక్షణమే విడుదల చేయాల్సి ఉంది. అలాగే ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆగిపోయిన అభివృద్ధి పనులను పునరుద్ధరించి ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



## 5న టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బోనాలు

**అక్షరటుడే, ఇందూరు:** టీఎన్జీవోస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 5న బోనాల పండుగను నిర్వహించనున్నట్లు ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన టీఎన్జీవోస్ భవన్‌లో మాట్లాడారు. నాశెట్టి సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 5న ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభాస్థలి నుండి బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అక్కడి నుండి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి, పాత కలెక్టరేట్ ఆలయ ఆవరణలో నవదుర్గామాతకు భక్తిశ్రద్ధలతో సమర్పిస్తామని వివరించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, భూపతిరెడ్డి, మేయర్ ఉమారాణి, కలెక్టర్, సీపీ, మాజీ మేయర్‌లకు ఆహ్వాన పత్రాలు అందజేశామని చెప్పారు.

## పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్ట్..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగిరెడ్డిపేట లోని పోచారం ప్రాజెక్ట్ పొంగిపొర్లుతుంది. ప్రాజెక్టు నిండడంతో పరిసర ప్రాంతాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ఇన్‌ఫ్లో 2,200 నుంచి 5,207 క్యూసెక్కులకు పెరిగింది. సోమవారం ఉదయం 11గంటలకు ప్రాజెక్ట్ నీటి మట్టం 1464.00 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా అదేస్థాయిలో నీటిమట్టం ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ఇన్‌ఫ్లో 5,207 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం కాలువలకు నీటి విడుదల చేయట్లేదు. మిగులు నీరు ప్రాజెక్ట్‌పై నుంచి పొంగి మంజీరలోకి వెళ్తోంది. లింగంపేట పెద్దవాగు, గుండారం వాగుల ద్వారా భారీగా వరద వస్తోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరడంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. నదులు, వాగులు, కాలువల వద్దకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ నిండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాబోయే ఖరీఫ్, వానాకాలం పంటలకు సాగునీటి కొరత ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా పెరిగే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

## నిజామాబాద్ బస్టాండ్‌ను ఆధునీకరించండి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరంలోని బస్టాండ్‌ను ఆధునీకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన బస్టాండ్‌కు స్థలం కేటాయించాలని అనే కమార్లు మంత్రులను కలిసినట్లు గుర్తుచేశారు. అప్పటివరకు ప్రస్తుత బస్టాండ్‌ను ను సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన వేచియుండే హాలు ఏర్పాటు చేయాలని, బస్సుల రాకపోకల సమాచారాన్ని అందించే డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సీసీ కెమెరాలను, తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రైవేటు వాహనాలు, ఆటో రిక్షాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన వాగులు..



**అక్షరటుడే, లింగంపేట:** కామారెడ్డి జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయి. రాత్రంతా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుని, రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వంతెనలపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యారు. లింగంపేట మండలంలోని పెద్దవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వంతెనకు ఆనుకుని భారీగా వరద నీరు పారుతుండటంతో ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి. అప్రమత్తమైన పోలీసులు వంతెన వద్ద భద్రతా చర్యలు చేపట్టి, ఎవరూ వంతెన దాటకుండా హెచ్చరికలు జారీ చేశారు. ఇక నాగారం వంతెనపై కూడా పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నాగారం, బాణాపూర్, కొర్పోల్, బాయంపల్లి గ్రామాల ప్రజలకు లింగంపేటతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది భారీ వర్షాలకు దెబ్బతిన్న పాములవాగు వంతెన స్థానంలో అధికారులు తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేశారు. అయితే సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పాములవాగు మరోసారి ఉగ్రరూపం దాల్చింది. వరద నీరు తాత్కాలిక వంతెనపై నుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో లింగంపేట-కామారెడ్డి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పరిస్థితిని పరిశీలించిన స్థానిక పోలీసులు వెంటనే అప్రమత్తమై వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మార్గంలో ప్రయాణించవద్దని, ప్రత్యామ్నాయ రహదారులను ఉపయోగించాలని లింగంపేట ఎస్సై దీపక్ కుమార్ ప్రజలకు సూచించారు. భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, వంతెనలు దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## వరద నీటిలో నిలిచిపోయిన పెళ్లి బస్సు.. రక్షించిన పోలీసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం పట్టణాన్ని అతలాకుతలం చేసింది. ప్రధాన రహదారులు, కాలనీలు నీటితో నిండిపోయాయి. భారీ వర్షాల కారణంగా రామారెడ్డి రోడ్డులోని సుభాష్ టాకీస్ సమీపంలో రోడ్డుపై భారీగా నీరు ప్రవహించింది. గొల్లపల్లి నుండి రంగంపేటకు పెళ్లి కార్యక్రమానికి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆ మార్గంలో వెళ్తుండగా.. సైలెన్సర్‌లో నీరు చేరడంతో బస్సు రోడ్డు మధ్యలోనే నిలిచిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే కామారెడ్డి పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోప్ సహాయంతో బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరో బస్సులో వారి గమ్యస్థానానికి పంపించారు.

## ఆస్తి తగాదాలతో అన్న హత్య..

**అక్షరటుడే, కామారెడ్డి:** పాత కక్షలు ఆస్తితగాదాలతో అన్నను తమ్ముడితో పాటు అతడి కుమారుడు కలిసి హత్య చేశారు. ఈ ఘటనలో తండ్రీకొడుకులకు కామారెడ్డి జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన వడ్ల మారుతి 2018 సెప్టెంబర్ 2న దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు వడ్ల రాజ్‌కుమార్ బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం వడ్ల మారుతి, నిందితుడు వడ్ల సాయిలు స్వయానా అన్నదమ్ములు. కుటుంబ పెద్దలు ఆస్తి పంపకాల సమయంలో మారుతి పేరిట 3 ఎకరాలు, సాయిలు పేరిట 2 ఎకరాలు పట్టా చేశారు. అయితే ఇంకా అర ఎకరం రావాల్సి ఉండడంతో ఇరువురి మధ్య సుమారు 10 ఏళ్లుగా విభేదాలు ఉన్నాయి. ఈ విషయంలో గతంలో సాయిలు తన అన్నపై కేసు కూడా పెట్టాడు. తర్వాత కోర్టులో రాజీ కుదిరి, అర ఎకరం ఇస్తానని మారుతి హామీ ఇవ్వడంతో కేసును ఉపసంహరించుకున్నారు. కానీ మాట తప్పడంతో కక్షలు కొనసాగాయి. ఘటన రోజున సాయిలు మృదంగం రిపేరు చేయించాలనే సాకుతో అన్న మారుతిని ఇంటికి పిలిపించాడు. అక్కడ తన కుమారుడు వడ్ల గజానంద్‌తో కలిసి వడ్రంగి బాడిషతో మారుతి తలపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మారుతిని 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. కేసును విచారించిన జిల్లా న్యాయమూర్తి పి. ముక్తిద సాక్ష్యాలను పరిశీలించి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.




# కొట్టుకుపోయిన రోడ్లు..

■ నిలిచిన రాకపోకలు ■ ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు ■ ఇబ్బందులు పడ్డ ప్రజలు

**కామారెడ్డిలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం పట్టణాన్ని ఆగం చేసింది. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో రాత్రి సుమారు 3 గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షా నికి పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

వర్షం కారణంగా కామారెడ్డి పట్టణంలోని రహదారుల్లో నీళ్లు నిలిచి రాకపోకలు స్తంభించాయి. రామారెడ్డి రోడ్డులో డ్రెయినేజీ నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో పెళ్లి బస్సు సైలెన్సర్ లో నీళ్లు చేరి బస్సు నిలిచిపోయింది. దాంతో బస్సులో ఉన్న ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ సిబ్బంది రోప్ సహాయంతో 45 మందిని బస్సులో నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చి ఇతర బస్సులో గమ్యస్థానానికి చేర్చారు. నిజాంసాగర్ రోడ్డులో విద్యానగర్, కాకతీయ నగర్, దేవునిపల్లి గ్రామాల నుంచి వచ్చే నీటితో రహదారిపై నీళ్లు నిలిచిపోయాయి. విశాల్ షాపింగ్ మాల్ సెల్లార్‌లో నీళ్లు చేరాయి.

### టీచర్స్ కాలనీలో..

టీచర్స్ కాలనీ వర్షం నీటిలో చిక్కుకుంది. ఇళ్లలోకి నీళ్లు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు ధ్వంసమయ్యాయి. పంచముఖి హనుమాన్ ఆలయం ముందు గల కల్వర్టు నిండిపోయి పంచముఖి హనుమాన్ కాలనీ మొత్తం నీటితో నిండిపోయింది. మోకాలి లోతు నీళ్లలో ప్రజలు బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. స్థానిక కౌన్సిలర్ జేసీబీతో డ్రైనేజీలో నిండిపోయిన మట్టి, చెత్తను తొలగించారు. వర్షపు నీటికి కొట్టుకు వచ్చిన ఇసుకను ట్రాక్టర్‌లో తరలించారు. భారీ వర్షానికి రైల్వే కమాన్ కింద, పోలీస్ స్టేషన్ ముందు నీళ్లు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### ఉప్పొంగిన పెద్దచెరువు

పెద్దచెరువు నిండిపోయి ఉప్పొంగడంతో వరద కాలువ నిండుగా పారుతోంది. జీఆర్ కాలనీ పక్క నుంచే ఈ కాలువ వెళ్తుండడంతో ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. తాడ్వాయి మండలం కాళోజీవాడిలో వర్షం నీరు చేరడంతో రహదారిని బ్లాక్ చేశాయి. గ్రామం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి పెద్ద చెరువు నిండిపోవడంతో ఉప్పొంగి ప్రవహిస్తోంది. దాంతో తిలకించడానికి ప్రజలు తరలివస్తున్నారు. వరద తీవ్రత దృష్ట్యా పెద్దచెరువును ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. ప్రజలను చెరువు నీటి వద్దకు అనుమతించవద్దని పోలీసులకు సూచించారు.

## చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేస్తే 'సెల్యులైటిస్'గా మారవచ్చు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చిన్న గాయమని వదిలేస్తే.. అది సెల్యులైటిస్‌గా మారి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని మెడికవర్ హాస్పిటల్స్, నిజామాబాద్ జనరల్ సర్జన్ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లాలో డయాబెటిస్, రక్తప్రసరణ సమస్యలు, గాయాలు, పాదాల పరిశుభ్రత లోపించడం వంటి కారణాలతో సెల్యులైటిస్ కేసులు పెరుగుతున్నాయని మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. సెల్యులైటిస్ అనేది చర్మం, చర్మం కింద ఉండే మృదు కణజాలంలో బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ అని తెలిపారు. సాధారణంగా కాళ్లు, పాదాలు, చేతుల్లో ఈ ఇన్ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది. చిన్న గాయం, గీత, పగుళ్లు, పురుగు కాటు వంటి వాటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. ముఖ్యంగా మధుమేహం, ఊబకాయం, రక్తప్రసరణ లోపం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సెల్యులైటిస్ ప్రారంభ దశలో కాలు లేదా ప్రభావిత భాగం ఎర్రగా మారడం, వాపు రావడం, నొప్పి, వేడిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని జనరల్ సర్జన్ పేర్కొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. మన ఊరు - మన భద్రత - మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ పరిధిలోని క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజ్‌లో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి..

**అక్షరటుడే, ఇందూరు:** బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని 45వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ గోపాల్ అన్నారు. డివిజన్‌లోని వినాయక్‌నగర్ పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు ఆమె పలు సూచనలు చేశారు. అలాగే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేలా పీహెచ్‌సీ సిబ్బంది ఎప్పటికప్పుడు వారిని మానిటరింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాముల వాగు వంతెనపై వాహనాల రాకపోకలు ప్రారంభం

**అక్షరటుడే, లింగంపేట:** లింగంపల్లి కుర్దు గ్రామంలోని పాముల వాగు తాత్కాలిక వంతెన సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోకుల్ సాయిరాం, గొల్ల కాశీరాం, కొత్త పోచయ్య, అంజయ్య తదితర గ్రామ పెద్దలు ముందుకు వచ్చి తాత్కాలిక వంతెనపై మొరంపోయించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రాకపోకలు కొనసాగే విధంగా చేయడంతో స్థానిక ప్రజలు వాహన చోదకులు వారిని అభినందించారు. లింగంపేట మండలం పాములవాగు వంతెన వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన కోతకు గురి కావడంతో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. ప్రయాణికులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ నారాయణ, ఎస్సై దీపక్‌కుమార్‌కు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వెళ్లవద్దని, సెల్ఫీల కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దని వారు సూచించారు. వారి వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు. మండలంలోని లింగంపల్లి కుర్దు సమీపంలోని కేకేవై రహదారిపై ఉన్న పాములవాగు వంతెన గతేడాది కొట్టుకుపోగా బాగు చేయించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను కోరినా పట్టించుకోలేదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వంతన వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెగిపోయిన వంతెనను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించి ఏడాది గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో మళ్లీ కొట్టుకుపోయిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాది కురిసిన వర్షాలకు తెగిపోయిన వంతెనను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాములాగు వంతెన వద్ద వేసిన తాత్కాలిక వంతెనకు రూ. కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముదాం సాయిలు, బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్, కపిల్ రెడ్డి, నర్సింలు, దాసరి పరువయ్య తదితరులు పాల్గొన్నారు.




2
4.7.2026
AKSHARA
భారీ వానొస్తే
ఆగమే..!

## 'డబుల్'ఇళ్లను పరిశీలించిన సునీల్ కుమార్



**అక్షరటుడే, మెండోరా:** బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ మంగళవారం మెండోరా మండల కేంద్రంలో పర్యటించారు. డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో ప్రారంభమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. గృహ సముదాయానికి రహదారులు, డ్రెయి నేజీ వంటి మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేర్కొన్నారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన విమర్శలు చేస్తూ, ప్రభుత్వాన్ని పదేపదే విమర్శించడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించి ప్రభుత్వంతో సమన్వయం చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నానని, ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డివైడర్లలో మొక్కల పెంపకం

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో ఉన్న డివైడర్లలో గ్రామ పంచాయతీ పాలకవర్గం సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే జాగ్రత్త కూడా తీసుకోవాలని సూచించారు. వాటికి ట్రీ గార్డ్‌లను ఏర్పాటు చేసి సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుక సంజీవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ సంజీవ్, సెక్రెటరీ నాగరాజు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్‌లో ఘనంగా బోనాల పండుగ




**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలో మంగళవారం ఆనవాయితీగా వస్తున్న ఆషాఢ మాసంలో భాగంగా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ నిర్వహించారు. ఆడపడుచులతో కలిసి సర్పంచ్ కల్లూరి సంధ్య బోనాలు ఎత్తుకుని మంగళ హారతులతో డప్పు వాయిద్యాల మధ్య, పోతురాజుల విన్యాసాలతో పెద్ద పోచమ్మ తల్లి మందిరానికి బయలుదేరి వెళ్లారు. మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. పెద్ద పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో దొంగల బీభత్సం.. తాళం వేసిన ఇంట్లో చోరీ..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని చోరీలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు దర్జాగా దోచుకెళ్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరలోని మూడో టౌన్ పరిధిలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. యజమాని సాయికుమార్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. మూడు తులాల బంగారు గొలుసు, 6 తులాల వెండికడియాలు, రూ.8వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## జలమయమైన బడి.. స్పందించిన అధికార యంత్రాంగం..

**కామారెడ్డి పట్టణంలో కురిసిన భారీ వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. పట్టణంలోని 20వ వార్డులోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో వర్షపు నీరు చేరి చిన్నపాటి కుంటను తలపించింది. దాంతో విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాసేపటి తర్వాత ఒకరి సహాయంతో మరొకరు నీటిలో నుంచి తరగతి గదుల్లోకి వెళ్లారు. సమాచారం అందుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి తక్షణమే స్పందించారు. పాఠశాలలోని నీరు బయటకు వెళ్లేవిధంగా దారిని ఏర్పాటు చేసి నీటిని తొలగించారు. దీంతో ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – అక్షరటుడే, కామారెడ్డి**